# నలుసు కోసం

పి. వి. అన్నపూర్ణ

"నేను రానుగాక రాను. చాలు యిప్పటికి చేసిన యాత్రలు, పూజలు. కావాలంటే దేవుడిమీద అంత భక్తి వుంటే మీరు వెళ్ళండి". శ్యామలాంబ గారి కంఠం ఉగ్రమైన స్థాయిలో పలికింది. "అది కాదే. ఏదో మనిద్దరమూ పెద్దవాళ్ళమయిపోయామా. కృష్ణా, రామా అనుకుంటూ రోజులు వెళ్ళబుచ్చుకోవాలి కదా మరి. అంత విరక్తిగా రాననేస్తావేంటి ?

"కాదంటే దేవుడు మనకి చేసిన మేలు ఏమిటీ అంట. భక్తిగా మహిమా వారా ఆయన్నే నమ్మి ఊహ ఎరిగినప్పటినుంచి కొలుస్తున్నాం గదా, ఒక్క నలుసుని ప్రసాదించాడా మనకి ? ఇంకా ఏమిటో మీరు ఈ యాత్రలని. దేవుడని నమ్మకం పెట్టుకున్నారు. నాకు మాత్రం పూర్తిగా దేవుడి మీద నమ్మకం పోయింది. నాస్తికురాల్ననుకున్నా సరే. ఏమనుకున్నా పరవాలేదు".

"అది కాదు శ్యామలా, మన కోరికలు తీరనంత మాత్రాన దేవుడిమీదే నమ్మకం పోగొట్టుకుంటే ఎలా ? ఏదో మనం ఈ మాత్రంగా వున్నామంటే భగవంతుడు మనల్ని ఓ కంట కనిపెట్టి వున్నాడనేగా అర్థం. పూర్తిగా విడనాడి చేస్తే లాభం లేక పోగా, మనకేమైనా హాని కలగచ్చు. అవునా"

"దేవుడు మనకింతకన్నా చేసే నష్టమేముంది లెండి. రోజులిలా వెళ్ళిపోతే చాలు అసలు దేవుడనే వాడుంటే మనం ఆయన్ను నమ్ముకొని కొలిచిన రీతికి తప్పకుండ ప్రతిఫలం ముట్టచెప్పే వాడే. ఏదో మనల్ని నమ్మించడానికి పురాణాలు అవి ఏకరువు పెట్టారు పెద్దవాళ్ళు. ఎప్పుడో ద్రౌపది సభలో శ్రీకృష్ణుడ్ని తల్చుకుంటె వచ్చి రక్షించాడని, గజేంద్రుడ్ని మొసలి బారినుంచి రక్షించాడని, ఇవన్ని నామటుకు నాకు కట్టుకథల్లాగానే తోస్తున్నాయి. ఆ మాత్రం భక్తితో మనం పూజల్చేయలేదా ? మొక్కులు మొక్కుకోలేదా. మీరెన్నన్నా చెప్పండి నేను మాత్రం ఒళ్ళు విరక్కొట్టుకుని ఈ యాత్రలు చేయలేను. ఆ పుణ్యమేదో మీరే సంపాయించుకోండి".

"పోన్లే మనం అనుకున్నది నెరవేరలేదు. అందుకని భగవంతుడే లేడంటే ఎట్లా ? సృష్టి చూడు. అందులో ఎంత భిన్నత్వం ఉంది. రకరకాల మనుష్యులు, రకరకాల మనస్తత్వాలు, చెట్లు, చేమలు పక్షులు. మరి వీటన్నిటకి సృష్టి కారకుడెవరన్నా వుండాలా. ఆలోచించి చూస్తే ఇది మానవుడికి సాధ్యమయిన పనిగా తోచదు. అన్నింటికి అతీతమైన శక్తి ఏదో వుండి వుండాలి. అదే దేవుడు అని మనం అనుకుంటున్నాము. ఎన్ని రకాలో చూడు మానవుల్లో కుంటి, గుడ్డి, ముసలి, ముతక, పేద ధనవంతులు ఇలా చూస్తూ పోతే ఉన్న మతికూడ పోతుంది. మరి అందరు ఒక్క రకంగా వుండరెందుచేత ? వాళ్ల వాళ్ళు చేసుకున్న పూర్వ జన్మ సుకృతాన్ని బట్టి ఈ జన్మలో అనుభవాలుంటాయి. జన్మ రాహిత్యమే మోక్షం. మోక్షం— అదెలా వస్తుంది ? మానవ సేవే మాధవ సేవ అంటారు గదా అట్లు పోని సాటి మానవులకి వీలయినంత వరకు సహాయ పడడం. ఏదో వాళ్ళ కష్టాల్లో పాలు పంచుకోవడం చేస్తే కొంత కాకపోతే కొంతయినా

ముక్తి లభిస్తుంది. ఒంటిగట్టు రామలింగం లాగా ఒక పరిధి నిర్మించుకుని ఎవ్వరితో సంబంధం లేనట్లు అందులోనే వుంటూ రోజులు వెళ్ళబుచ్చితే మనకు భగవంతుడేమి మేలు చేస్తాడు చెప్పు? మొన్న టికి మొన్న అంతే ఆ కుర్రవాడెవరో పాపం పరీక్ష ఫీజు కట్టడానికి డబ్బు లేకపోతే ఓ 30 రూ॥ ఇచ్చానని ఎందుకంత గొడవ చేసినట్లు? ఏం కట్టుకుపోతామా ఈ డబ్బు మనతో."

"ఏం చేయలేదేమిటి మనం మాత్రం? కాప రానికొచ్చిన తొలి రోజుల్లో ఆ వారాల కుర్రాడు మనింటికొచ్చి చదువుకునే వాడు గదూ. ఇప్పుడు తనకేం లక్షణంగా మంచి పదవిలో వున్నాడు. మంచి మనస్సు వుంది కాబట్టే సహాయం చేశాం. మనం మాత్రం అట్లాగే అప్పుడెట్లా వున్నామో యిప్పుడట్లాగే వున్నాం. ఇప్పుడు ఆయన్ని మర్చి పోతే హానిచేసే దేవుడు అప్పుడేమయ్యాడు? నిత్య పూజలు జరుపుతూ ఎన్ని దానాలు చేశాం; అప్పుడు గుడ్డి వాడయ్యాడా? ఎక్కని కొండ లేదు మొక్కని పుట్టలేదు అట్లా సేవచేశాం గదా. ఏం ఒరిగించాడని?

"కాదు శ్యామలీ చెప్తే అర్థం చేసుకోవేం. మనం చూశావు ఎప్పుడూ కోరికలతో ఏ పని చేయ కూడదు. నిజమైన భక్తి అంటే ప్రతిఫలం కోర కూడదు. ఏది ఎలా జరగాలనుందో అట్లా జరుగు తుంది మనం నిమిత్తమాత్రులం".

"అవును మీరన్నట్లు ఎట్లా జరగాలనుంటే అట్లా జరుగుతుంది, అట్లాంటప్పుడు అలా జరగా లని వున్నదాన్ని దేవుడుకూడా తప్పించ లేడనేగా దానర్థం. ఇంక అలాంటప్పుడు దేవుడ్ని కొలిచి మాత్రం ఏముంది? కర్మలో ఎట్లా ఉంటే అట్లా జరుగుతుంది. దేవుడుకూడ దాన్ని తప్పించలేడు అంటారు గదా, తప్పించలేని దానికోసం దేవుణ్ణి ప్రార్థించి మాత్రం ప్రయోజనం ఏమిటి? జరగాలి అని వుంటే భగవంతుని కొలిచినా కొలువకపోయినా జరుగుతుంది. జరక్కూడదనిది వుంటే ఎంత భగ వంతుణ్ణి కొలిచినా జరక్కూడనిది జరుగదు గదా. ఎందుకంటే ఆ కర్మని తొలగించె నేర్పు ఎవ్వరికీ లేదు కాబట్టి మరియిప్పుడు భగవంతుణ్ణి కొలవడంలో అర్థమేమిటి? ఆయన ఏం చేయలేనప్పుడు?

"ఏమిటో నీ వాదం నా కర్థం కావడం లేదు. ఎవరికైనా పెద్ద వాళ్ళవుతున్న కొద్దీ చిత్తం భగవంతుడి మీదికి పోతుంది. అలాంటిది నీకు వయ స్సొచ్చిన కొద్దీ వున్న భక్తికూడ అడుగంటుతోంది. ఏం జరగనున్నదో నీకిలాంటి బుద్ధులు పుడ్తున్నాయి."

"ఏమీ జరుగదు లేండి, నాకామాత్రం ధైర్యం వుంది. ఇన్నాళ్ళు జీవితంలో వున్న నిజం తెలుసుకో గలిగాను. ఇప్పటికయినా కళ్ళు తెరుపుళ్ళు పడ్డాయి. ఇంకా అంధత్వంలో వుండి నువ్వే దిక్కని కను పించిన రాయి రప్పల్ని చెట్లు చెమల్ని యిదివరకు రోజుల్లో కొలిచినట్లు కొలవకుండా జ్ఞానోదయమైంది. ఇప్పటికైనా. ఉపవాసాలతో, ప్రదక్షిణాలతో చేసిన రిసర్చికి యిప్పటికైనా, డాక్టరేటు దొరకబోతుంది. నా జన్మ ధన్యమైంది" ఎంతో ఆవేశంగా అంది.

"ప్చ్. . . . లాభంలేదు. ముదిరిపోయింది వ్యవహారం. ఎపిచ్చో ఎక్కుతుందో ఏమో. అంత పవిత్రంగా నిష్ఠగా వుండే శ్యామలేనా యిలా మాట్లా డుతోంది? వేదెక్కిన బుర్రని రెండు చేతుల మధ్యా పెట్టుకుని విచారంగా కూర్చున్నారు లక్ష్మీప్రసాదం గారు.

• • •

పక్షుల కిలకిలారావాలు పచ్చని చెట్లమీదినుంచి వీచే చల్లని గాడ్పులు. అరుణకిరణుడు ప్రకృతి కాం తతో దోబూచులాడుతున్నాడు. వేడి కిరణాలు ఆకుల మీద పడి తళతళ మెరుస్తున్నాయి ఉలిక్కిపడి లేచింది శ్యామలాంబ. కిటికీ తలుపులు తీసి చూసింది.

పెద్దపెద్దవృక్షాలుచుట్టూ మధ్యలో ఒక చిన్న యిల్లు ఇంటి ముందనేకం పూల మొక్కలు. కొంచెందూరాన పెద్ద బావి అప్పుడే యింకా తెల్లవారనన్నాలేదు. జనం హడావుడి చేస్తూ బావి దగ్గర కొచ్చారు నీళ్ళకు. గిలకకి తాడువేసి నీళ్ళు తోడుతున్నారు. కిర్ కిర్ మని గిలక చప్పుడు. స్నానాలు చేసేవాళ్లు చేస్తున్నారు తడిగుడ్డల్తో వచ్చేవాళ్లు వస్తున్నారు. కొంచెం పైకి పెద్ద కొండ. దానిమీద గోపురం. అబ్బ ఏంత ఎత్తయిన శిఖరం. దానిమీద రంగులురంగులుగా కనబడుతున్నాయి. ఎందుకో యివ్వాళ శిఖరం చాల ఎత్తున ఉన్నట్లనిపిస్తోంది. "రోజూ యింత పైకి ఎక్కుతున్నామా మేం, నమ్మలేనట్లుందే ఈ నిజం" తనలో తను ఆశ్చర్యపోయింది శ్యామలాంబ.

అది షోలింగర్ గ్రామం. ఉత్తర ఆర్కాటు జిల్లాలోని ఒక పవిత్ర స్థానం. ఊరి మొత్తానికి ఓ వంద యిళ్ళయినా ఉండవు. అదికూడ విసిరేసినట్లు అక్కడొకటి యిక్కడొకటి. చుట్టూ కొండలు మధ్యమధ్యలో పెద్దపెద్ద చెట్లు. అక్కడక్కడ యిళ్ళు ఇది ఆ ఊరి ఆస్తి. ఆ ఊరు అంత ప్రాముఖ్యం వహించడానికి కారణభూతమైన నృసింహస్వామి దేవాలయం ఎంతో ఎత్తున కొండ శిఖరాన నిర్మించబడింది. దాన్ని గురించి, ఆ దేవుణ్ణి గూర్చి ఎన్నో ఎన్నో కథలు చెప్తారు. అంతటి మహిమగలదేవుడని భక్తుల నమ్మకం. ఏది ఎట్లా వున్నా బస్సుమార్గం కూడా లేని ఆ కొండమిదికి ఎన్నో వందల మెట్లు ఎక్కించి తన దగ్గరికి రప్పించుకుంటున్న ఆ స్వామి నెప్పు కొనియాడ తగినదే. వంద, రెండు వందల మెట్లు ఎక్కేవాటికి ఒక మంటపం; అక్కడ అరుగులు. చుట్టూ చెట్లు. ఆ చల్లటిగాలి, ఆ వాతావరణం, ఆ ప్రశాంతత, ఈ మెట్లు ఎక్కిన శ్రమని క్షణంలో తొలగిస్తాయి. ఎండెక్కితే కష్టమని సూర్యోదయాత్పూర్వమే స్నానం చేసి కొండ ఎక్కుతారు భక్తులంతా. మంటపాల్లో మజిలీలు చేస్తూ ప్రకృతి సౌందర్యానికి తన్మయులౌతూ, స్వామి లీలలను కథలుగా చెప్పుకుంటూ అలుపు అనేది లేకుండా కొండ చేర్తారు. ముసలివాళ్ళు, మరీ చిన్నపిల్లలు ఒకళ్ళేమిటి అన్నిరకాలవాళ్ళు సునాయాసంగా ఎక్కుతారా కొండని. పట్టుమని పది మెట్లెక్కితే అలసిపోయే అబలా మణులుకూడ ఏమాత్రం శ్రమలేకుండా ఎప్పుడెప్పుడు శిఖరాగ్రాన్ని చేర్తామా, ఎప్పుడెప్పుడు స్వామి దర్శనం పొందుదామా అనే ఉత్సుకతతో ఎక్కుతారు.

అనుకున్నవన్ని సఫలమవుతాయని, ఎల్లాంటి డాక్టర్లకి కుదరని జబ్బులు స్వామి దర్శనమాత్రంచేత మటుమాయమవుతాయని భక్తుల నమ్మకం. ఎంతకి పెళ్ళిగాని కూతురికోసం ఓ తల్లి రోజూ కొండెక్కి కొన్నాళ్ళు సేవ చేసేప్పటికి స్వామి కల్లో కనబడి "ఏం భయ పడకండి త్వరలో పెళ్ళవుతుందని" చెప్పాడని తరువాత కొద్దిరోజులకే ఆ అమ్మాయికి పెళ్ళయిందని, పిల్లల్లేని ఒక ఆవిడకి నిష్ఠగా ప్రదక్షిణాలు చేసేప్పటికి కలలో కనిపించి పండు యిచ్చినట్లుగా, కొద్ది రోజులకే సంతానం కలిగినట్లు ఒకటేమిటి యిలాంటి కథలెన్నో చెప్పుకుంటారు.

◆ ◆ ◆

"ఈ బాబు చూశారా ఎంత బాగున్నాడో" అంటూ బాబుని వళ్ళంతా ముద్దుల్తో ముంచేస్తూ వచ్చింది శ్యామల. నాకింకా నిద్రమత్తు వదల్లేదు. అలాగే మంచం మీద పడుకున్నాను. కళ్లు నులువుకుంటూ లేచి బాబుని ఎత్తుకున్నాను

"ఎవరి బాబు ? భలే ముద్దొస్తున్నాడు గదూ" అన్నాను. "అవునండి ఆరోనెలట. ఎంత ఆరోగ్యంగా వున్నాడో పిల్లవాడు కదిలిస్తే నవ్వుతున్నాడు. మన పక్కింట్లోకి వచ్చారే సుందరివాళ్ళు వాళ్ళ అబ్బాయి. నాకు మొన్ననే పరిచయమైంది ఆవిడతో. ఎంత మంచావిడ అనుకున్నారూ. మధ్యాహ్నం మీరు ఆఫీసులకు వెళ్ళగానే మా కిద్దరికి బోల్డు కాల

క్షేపం. ఆవిడ కథలవి రాసుండిట. ఆ కథలన్నీ నా కిస్తుంది చదవమని. మరి మర్చేపోయా చెప్పడం. వాళ్ళకిట ఎన్నోరోజులు పిల్లల్లేరుట. అప్పుడేమో ఎవరో షోలింగర్ వెళ్లి సేవచేస్తే పిల్లలు పుడ్తారని చెప్తే ఆవిడ ఒక్కత్తి వెళ్లి అక్కడ నెలరోజులుండి రోజు దేవుడి దర్శనం చేసుకునేదట. తరవాత దేవుడు కలలో కనిపించి పండు కొబ్బరికాయ తన చేతుల్లో పెట్టినట్లు కనబడిందిట. అక్కడి వాళ్ళతో చెప్తే "మీకు ఉత్తరువు అయిపోయింది. మీకు త్వరలో సంతాన ప్రాప్తి కలుగుతుందని" చెప్పారుట. అలాగే కొన్నాళ్ళకి ఈ బాబు పుట్టాడుట. ఆవిడకి ఎంత భక్తనుకున్నారు. ఎన్ని కథలు చెపుందో దేవుణ్ణి గురించి. మరే.... మనల్నిద్దర్నికూడ అక్కడికి వెళ్ళి సేవ చేయమని చెప్పిందండి. పోనీ వెళ్ళొద్దామేమిటి? ఎండాకాలంలో ఓ నెలరోజులు సెలవు పెట్టండి చూసొద్దాం" ఏకధాటిగా చెప్పుకుపోతుంది శ్యామల. నాకు తనని చూస్తుంటే చాల జాలనిపించింది. పిచ్చిది. మాతృప్రేమ అలా ఉంటుందేమో. తనకేం తెలుసు ఏదో పిల్లలు లేరే అని ఏదో జ్ఞాపకం వచ్చినప్పుడు అనుకోవడమే తప్ప, వాళ్లు పడే ఆరాటం తేలీదు. నిజంచెప్పాలంటే అప్పట్లో నాకు దేవుడిమీద అంత నమ్మకమూలేదు. ఈ పూజలవల్ల అంటే లంచం పెట్టడంతో మనకి ప్రతిఫలం దొరుకుతుందా దేవుడంత అవినీతిపరుడా. యిలా వుండేవి నా ఆలోచన్లు. అయినా శ్యామల అమాయక వదనం చూస్తూ తన మాట కాదనేపాటి ధైర్యం నాకు లేకపోయింది.

"సరేలే వెళ్దాం లెద్దూ" అన్నాను నిర్లిప్తంగా.

"ఏమిటండీ అంత పట్టనట్టు మాట్లాడ్తారు. ఏ పుట్టలో ఏ పాముందో ఎవరు చూడొచ్చారు. పోనీ వెళ్లివస్తే నష్టం లేదుగదా. ఏమయినా సరే వెళ్లివదాం సరేనా" అంది బతిమాలుతున్నట్లు.

"సరే శ్యామలా వెళ్దాం. కాదన్నానా నేను మాత్రం" అన్నాను లాలనగా.

• • •

శ్యామలి, నేను అనుకున్నట్లుగా కొండకి వెళ్ళాం. నెలరోజులు రోజూ కొండెక్కడం, దేవుణ్ణి చూడ్డం. కిందికొచ్చి భోంచేయడం. కటికనిస్త ఆ రోజుల్లో. కిందే పడుకోవాలట. తలకి నూనెరాసుకో కూడదు. దువ్వుకోకూడదు, మడితోనే భోంచేయాలి. ఒకటేమిటి? చాల పవిత్రంగా సేవచేశాం. అందరు చెప్పినట్లు కలలు రాలేదు. నా సెలవయిపోయింది యింక వెళ్లిపోదాం అన్నాను. కాని శ్యామల వినిపించుకోలేదు. మూఢభక్తి పాపం. "మీరు వెళ్ళండి నాకిక్కడ బాగా అలవాటయింది గదా కొన్నాళ్లుండి ఉత్తరువు అయ్యాకే వస్తాను. మీకు సెలవు లేదుగా. మీరు వెళ్ళండి" అంది నాకు శ్యామలిని ఒంటరిగా ఒదిలిరావడం యిష్టం లేకపోయింది. కాని ఏం చేసేటట్లు. అప్పటికే సెలవు నెలరోజులయింది. ఇంక పెడ్తామన్నా సెలవులేదు. నాకు దిక్కుతోచలేదు. శ్యామలి మాత్రం నాతో రావడానికొప్పుకోలేదు. అక్కడ సత్రం యజమాని మూర్తిగార్కి శ్యామలి క్షేమ సమాచారాలు విచారించి నాకు తెలియబరుస్తూ వుండమని అడ్రెసు యిచ్చి ఉద్యోగపు వూరు వచ్చాను.

అది మొదలు శ్యామలి చెయ్యని పూజలేదు. చన్నీళ్ళ స్నానాలు, తడిబట్టలు, అప్రదక్షిణాలు ఒకటేమిటి? ఇంత మూఢత్వంలోకి దిగిపోతోందేమిటా అని నాకు దిగులనిపించేది. ఆ పట్టపట్టు 5, 6 నెల్ల పాటు షోలింగర్లోనే వుంది. తరవాత నాకో ఉత్తరం వచ్చింది ఆఫీసు అడ్రెసుకు. అది శ్యామలి రాసింది. ఎంతో క్లుప్తంగా వుంది. అయినా మనసులోని వైరాగ్యం అంతా ప్రస్ఫుటమవుతోంది అందులో.

ఏమండీ,

నేనిక్కడ క్షణమైనా వుండలేను. దేవుడు చాల పక్షపాతి. అందరిపట్ల ఒకరకంగా వుండడు. మనకు ప్రాప్తం లేని దానికోసం పట్టుకు ప్రాకులాడ్డం ఏం సబబు చెప్పండి. సామానంతా కట్టి సిద్ధంగా వున్నాను. వీలయినంత తొందర్లో వచ్చి నన్ను తీసుకెళ్ళండి.

ఇట్లు,
శ్యామలి.

అంతే అది మొదలు శ్యామలి పూర్తిగా మారిపోయింది. వెనుకటి ఉత్సాహం, మాటలధోరణి అన్ని తగ్గిపోయాయి. ఎంతో నిర్లిప్తంగా ఉంటోంది. ఏదీ పట్టనట్టు వేళకింత వండడం తినడం పడుకోవడం. ఓ మాట మంచి ఏమీ లేకుండా పోయాయి. నేను ఎన్నో విధాల నచ్చ చెప్పడానికి ప్రయత్నించాను ఏమీ వినిపించుకునేది కాదు. "నువ్వే ఓ చిన్న పిల్లవి . . . ఇంకా మనకెందుకు చెప్పు పిల్లలు." అనేవాడ్ని నవ్వేసి ఊరుకునేది. నేను ఎంతో పోగొట్టుకున్నట్లుగా బాధపడేవాడ్ని. జీవితంలో చాల వెలితి కనబడుతోంది. మరి ఎప్పటికది భర్తీ అవుతుందో ఏమో మరి ?

ఎక్కడికయినా వెళ్ళి తిరిగొస్తే తన మనస్సుకి హాయిగా వుంటుందేమోనంటే ఎక్కడికి రమ్మన్నా వచ్చేదికాదు. ఇదివరకు ఎంత నిష్ఠగా పూజలవి చేసేదో అట్లాంటిది యిప్పుడు కనీసం దేవుడికి దీపారాధన చేయడంకూడ మానుకుంది. ప్రతిమాటకి భగవద్గీతలో ఉదాహరణలు చెప్తూ నిత్యం గీతాపరాయణ చేసే శ్యామలి యిప్పుడసలు దాని జోలికే పోవడం లేదు. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తుండే శ్యామలి మొహంలో నవ్వు నామమాత్రానికైనా కనబడ్డంలేదు. నవ్వినా నిర్జీవంగా పేలవంగా ఓ నవ్వు విసుర్తుంది. అంతకుమించి ఏ స్పందనా లేదు మనిషిలో. భగవంతుడే దిక్కని పరిపూర్ణమైన మనస్సుతో కొలిచినందుకు కోరిక సఫలం కాకపోగా హాయిగా చిలుకా గోరింకల్లా వుండే మాకు కలతలు తెచ్చిపెట్టాడు. శ్యామల్ని నాకు కాకుండా చేశాడు భగవంతుడు.

మొన్నోమాటు తెలిసిన వాళ్ళింటికి వెళ్తే అక్కడ జరిగిన సంఘటన నన్ను కలచివేసింది. అందరం కూర్చున్నాం శ్యామలి నాకు కొంచెందూరంగా కూర్చుంది. శ్యామల పక్కన ఒక పాతికేళ్ళ యువతి వళ్ళో పాపని పెట్టుకుని కూచుంది. పాప ఆగకుండా ఏడుస్తోంది. పాలు పట్టింది, బొమ్మలు చూపించి ఆడించింది_ కాని ఏడుపుమాత్రం తగ్గలేదు. ఉండి వుండి మరీ శ్రుతిపెంచి ఏడుస్తోంది. తల్లి విసిగిపోయింది.

"ఛీ పాడుపిల్లలు పుట్టకపోతే ఏ దేవుడేడ్చాడు. లేకపోతే లేరని ఒకటే ఏడుపు. ఇప్పుడు ఏడవని క్షణమంటూ లేదు వీళ్ళతో. పొద్దునా అంతే ఆ బాబిగాడు ఏడ్చిఏడ్చి నా ప్రాణం తీసిగాని నిద్రపోలేదు. ఇప్పుడు యిది మొదలుపెట్టింది రాగం అంటూ ఆ వళ్ళోని పిల్లవి విసురుగా పక్కనే పరిచిన బొంత మీద పడుకోపెట్టింది. శ్యామల బాధగా చూస్తూ కూర్చుంది ఈ దృశ్యం, కళ్ళలో నీళ్లు చిప్పిల్లాయి. మెల్లిగా తలెత్తింది. నావైపు చూసింది. ఆ చూపుల లోతులు కొలవలేను నేను. ఎన్నెన్నో భావాలు వ్యక్తమవుతున్నాయి. "లేని వాళ్ళు లేరని ఏడుస్తుంటే వున్న వాళ్ళు యిలా అనుకోవడమా. పాతికేళ్ళకే యిద్దరు పిల్లల తల్లయినా ఆ తల్లి ఎంత చిరాకు పడ్తోంది పిల్లలతో. కావాలంటేమాత్రం వస్తారా పిల్లలు. నాలాంటి వాళ్ళకు ఆ అదృష్టం పట్టమన్నా పట్టదుకదా" అన్నట్లు వున్నాయి ఆ చూపులు. ఆ వాడి చూపుల ధాటికాగలేక తల వంచేసుకున్నాను నేను. శ్యామలినా స్థితిలో చూస్తే ఎంతో బాధనిపించింది. ఆ చూపే చాలు మనస్సు కదిల్చివేయడానికి. మాటలురాని మూగదైంది శ్యామలి. అన్నింటివి మూఢంగా నమ్మే శ్యామలి దేవుడన్నా దయ్యమన్నా కనీసపు నమ్మకాన్నికూడ కోల్పోయింది. మౌనమే శరణంగా సంవత్సరాలు గడిపివేస్తోంది.